క్లుప్తంగా...

నేడు మేడ్చల్‌లో పట్టణ ప్రగతి దినోత్సవం

మేడ్చల్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మేడ్చల్ పట్టణ ప్రగతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉత్సవాలు నిర్వహిస్తుండగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మంత్రి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆమె తెలిపారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డులో అండర్ డ్రైనేజీ పనులను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. రూ.10 లక్షలతో చేపడుతున్న పనులకు స్థానిక కౌన్సిలర్ అమరం సరస్వతిమోహన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులతో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు హేమంత్‌రెడ్డి, మల్లిఖార్జున్, బాలరాజ్, జైపాల్‌రెడ్డి, డీఈ దుర్గాప్రసాద్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పట్టణ ప్రగతి'ని వైభవంగా నిర్వహించాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో శుక్రవారం తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. ప్రజలకు నాటి, నేటి పరిస్థితులు అర్థమయ్యేలా విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ప్రతి కార్పొరేషన్, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఉత్తమ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కార్పొరేటర్లు/కౌన్సిలర్లు, చైర్మన్లు/ మేయర్లు, ఉద్యోగులకు సన్మానం చేయాలని ఆదేశించారు.

కల్యాణలక్ష్మీ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ దంపతులు

మేడ్చల్: ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కును మేడ్చల్ 16వ వార్డు కౌన్సిలర్ ఉమానాగరాజు లబ్ధిదారుడికి అందజేశారు. 16వ వార్డుకు చెందిన నిమ్మగడ్డ లావణ్యకు కల్యాణలక్ష్మీ ద్వారా రూ.లక్షా116 మంజూరు కావడంతో ఆ చెక్కును కౌన్సిలర్ ఉమానాగరాజు దంపతులు లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి అందజేశారు.

పోలీస్ చెక్‌పోస్ట్‌ను సందర్శించిన డీసీపీ


చెక్‌పోస్ట్ వద్ద సూచనలు చేస్తున్న డీసీపీ జానకి, ఏసీపీ నరేశ్‌రెడ్డి

ఘట్‌కేసర్: బక్రీద్ పర్వదినం పురస్కరించుకొని ఆవులను నగరంలోకి తీసుకెళ్లకుండా అవుషాపూర్ కేపాల్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను మల్కాజ్‌గిరి డీసీపీ జానకి, ఏసీపీ నరేశ్‌రెడ్డితో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీపై పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, అడ్మిన్ ఎస్సై నాగార్జునరెడ్డి, ఎస్సైలు ధనంజయ, రామునాయక్, శ్రీకాంత్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

బోడుప్పల్: సాయిమారుతీనగర్ కాలనీలోని సీతారామాంజనేయ స్వామి త్రయాహ్నిక ఏక కుండాత్మక ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. 10వ తేదీ నుంచి గురువారం వరకు వేడుకలను నిర్వహించారు. గురువారం సేవాకాలం, బాలభోగం, శాంతి పాఠం, ద్వారాతోరణ పూజ, నిత్యహోమం, మూలమంత్ర మూర్తి మంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, 7వ డివిజన్ కార్పొరేటర్ కాటపల్లి లతా రాంచంద్రారెడ్డి, నేతలు దానగల్ల యాదగిరి, మోదుగు శేఖర్‌రెడ్డి, కాటపల్లి రాంచంద్రారెడ్డి, కొత్త చక్రపాణిగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్స్ ఎప్పుడు..?

గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో 2,497 ప్రభుత్వ బడులు

- మొత్తం 3.64 లక్షల మంది విద్యార్థులు
- 15 రోజుల వ్యవధిలో పూర్తిస్థాయిలో అందజేసేలా..
- ఏకరూప దుస్తుల పంపిణీపై విద్యాశాఖ కసరత్తు
- 80 శాతం కుట్టడం పూర్తయినట్లు సమాచారం



సాక్షి, మేడ్చల్‌జిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు జతల ఏకరూప దస్తుల(యూనిఫామ్స్)ను అందిస్తోంది. గతేదాది బట్టల(క్లాత్)ను పాఠశాలలకు ఆసల్యంగా పంపడంతో వాటిని కుట్టించి విద్యార్థులకు అందజేయడానికి మరింత ఆలస్యమైంది. ఈ విద్యా సంవత్సరం అలాంటి జాప్యం జరగకుండా ప్రభుత్వం అప్రమత్తమైంది. పాఠశాలలు ప్రారంభం నుంచి మొదలుకొని 15 రోజుల వ్యవధిలో విద్యార్థులకు కొత్త దుస్తులను అందించాలని ముందస్తుగా ఏప్రిల్ నెలలోనే పాఠశాలలకు బట్టలను పంపిణీ చేసి కుట్టడానికి ఏజెన్సీలకు అందజేశారు.

ప్రతి సంవత్సరం రెండు జతలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఏటా రెండు జతల ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తోంది. 1 నుంచి 7వ తరగతి వరకు బాలురకు రెండు నిక్కర్లు, రెండు చొక్కాలు, 8 నుంచి 10వ తరగతి చదివే బాలురకు రెండు ప్యాంట్లు, రెండు చొక్కాలను, బాలికలకు రెండు జతల చుడీదార్ అందజేస్తారు. వేసవి సెలవులు ముగిసిన తర్వాత పాఠశాలల ప్రారంభం రోజున విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేయాలని విద్యాశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

- గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లో 3.64 లక్షల మంది విద్యార్థులు ఉండగా, ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున దుస్తులు పంపిణీ చేయాల్సి ఉంది. దుస్తులు కుట్టడానికి కావాల్సిన బట్టను ఏప్రిల్ నెల చివర్లో పాఠశాలలకు అందజేయగా, కుట్టడానికి ఏజెన్సీలకు అప్పగించారు. కాగా కుట్టాల్సిన దుస్తుల్లో ఇప్పటి వరకు 80 శాతం దుస్తులను కుట్టినట్లు తెలుస్తోంది. పూర్తయిన వాటిని పాఠశాలలకు తరలించి పంపిణీకి శ్రీకారం చుట్టారు. పాఠశాలలు ప్రారంభం నుంచి మొదలుకొని 15 రోజుల వ్యవధిలో పూర్తిస్థాయిలో దుస్తులను పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.
- హైదరాబాద్ సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రభుత్వం పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

జిల్లా పేరు	ప్రభుత్వ పా ఠశాలలు	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	631	1,08,635
మేడ్చల్–మల్కాజిగిరి	505	90,301
రంగారెడ్డి	1301	1,65,203
మొత్తం	2,497	3,64,139

అంకుషాపూర్‌లో పంచాయతీరాజ్ కమిషనర్ పర్యటన


అంకుషాపూర్ నర్సరీని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్ హన్మంతరావు

ఘట్‌కేసర్: రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హన్మంతరావు, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి గురువారం అంకుషాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీ, వైకుంఠధామం, డంపింగ్‌యార్డ్‌ను పరిశీలించారు. అలాగే నర్సరీలో ఎన్ని మొక్కలు పెంచుతున్నారు..? ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు పెంచారని అడిగి తెలుసుకున్నారు. తడి పొడి చెత్త సేకరణపై వివరాలు అడిగారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దేవసహాయం, డీఆర్‌డీఓ పద్మజారాణి, డీపీఓ రమణామూర్తి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ జలజ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ శోభారాణి, ఎంపీడీఓ అరుణారెడ్డి, కార్యదర్శి లింగారెడ్డి, ఉపసర్పంచ్ బాలమణి పాల్గొన్నారు.

బోనాల నిధులకు దరఖాస్తు చేసుకోవాలి

మల్కాజిగిరి: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వం నుంచి నిధులు పొందేందుకు దేవాలయాల నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీలోపు రెండు సెట్ల దరఖాస్తులు, దేవాలయం పేరున్న బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, దేవాలయం ఫొటో, దేవాలయం చైర్మన్ లేదా కార్యదర్శి ఆధార్ జిరాక్స్ జతపరిచి క్యాంప్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

వార్డు పరిపాలనపై సమీక్ష

అల్వాల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వార్డు పరిపాలన వ్యవస్థకు సర్కిల్‌లో శుక్రవారం నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ నాగమణి తెలిపారు. ఈ మేరకు గురువారం వార్డు కార్యాలయాలకు సంబంధించిన పలు అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సమీక్షించారు. సర్కిల్ పరిధిలోని 133వ డివిజన్, 134వ డివిజన్, 135వ డివిజన్‌లలో ఇప్పటికే వార్డు కార్యాలయాలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. నేటి నుంచి సర్కిల్‌కు సంబంధించిన పారిశుద్ధ్య, తాగునీరు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, యూసీడీ విభాగం వారు ప్రజలకు వార్డు స్థాయిలోనే అందుబాటులో ఉంటారని వివరించారు. కార్యక్రమంలో ఈఈ రాజు, డీఈ ప్రశాంతి, వార్డు అధికారి స్వామి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

4వ వార్డులో సమస్యలు పట్టవా..?

కీసర: కీసర గ్రామ పంచాయతీ పరిధిలోని 4వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో గ్రామసర్పంచ్ నాయకపు మాధురి నిర్లక్ష్యం వహిస్తోందని 4వ వార్డు సభ్యురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం కీసరలో ఆమె మాట్లాడుతూ కీసరలోని 4వ వార్డు పరిధిలోని వివిధ కాలనీల్లోని రహదారులపై మురుగు పారుతున్నా అంతర్గత మురుగు కాల్వల నిర్మాణాలు చేపట్టాలని, కొన్నేళ్లుగా పంచాయతీ పాలకవర్గం సమావేశాల్లో, గ్రామసభలో సర్పంచ్‌తోపాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అయినా రాజకీయ దురుద్దేశంతో తమ వార్డులో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. పంచాయతీ పాలకవర్గం సమావేశంలో తీర్మాణించిన పనులు కూడా ఎందుకు చేపట్టడంలేదో సర్పంచ్ మాధురికే తెలియాలన్నారు. 4వ వార్డు ప్రజలు కీసర గ్రామస్తులేననే విషయాన్ని సర్పంచ్ గుర్తుపెట్టుకోవాలన్నారు. అవసరం ఉన్నచోట కాకుండా గ్రామంలోని ఓ కాలనీలో అవసరం లేకున్నా పంచాయతీ తీర్మానం లేకుండా సుమారు రూ.6 లక్షలతో అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను సర్పంచ్ చేపడుతున్నారని, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. 4వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టకుంటే వార్డు ప్రజలతో పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి


మూడుచింతలపల్లిలో జీపుజాత వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

శామీర్‌పేట్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు సునీత అన్నారు. సీఐటీయూ అనుబంధంతో 16న ప్రారంభమయ్యే జీపుజాత వాల్‌పోస్టర్‌ను గురువారం మూడుచింతలపల్లి మండలకేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. ఐసీడీఎస్, అంగన్‌వాడీల రక్షణ కోసం 45వ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో జీపుజాత ప్రారంభమై వచ్చేనెల 10వ తేదీన ఆల్ ఇండియా డిమాండ్స్ డే 10కే వాక్ నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కృష్ణ, టీచర్ అనిత, పలువురు హెల్పర్లు పాల్గొన్నారు.

చెప్పుల దుకాణంలో అగ్నిప్రమాదం


పూర్తిగా దగ్ధమైన చెప్పుల షాపు

జవహర్‌నగర్: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని చెప్పుల దుకాణం పూర్తిగా కాలి బూడిదైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అలిల్వార్ సుధాకర్(43) బాలాజీనగర్‌లోని మార్కెట్ లేన్ ఎదురుగా 20 ఏళ్లుగా చెప్పుల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి వెళ్లగా రాత్రి సమయంలో అగ్నిప్రమాదం జరిగిందని స్థానికులు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. దుకాణం పూర్తిగా దగ్ధమవడంతో రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని తెలిపారు. షాపు యజమాని సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి


సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: సీఎం సహాయ నిధి అభాగ్యులకు అండగా నిలుస్తోందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు గురువారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేతులమీదుగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఆపదలో ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, ముత్యంరెడ్డి, సంతోష్‌రెడ్డి, డాక్టర్ చారి, లక్ష్మీనారాయణ, నరేష్ ముదిరాజ్, శివ, శ్రీధర్, వెంకట్‌రెడ్డి, సాయి, రాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలి


క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: యువత క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గురువారం కీసరదాయరలోని పీజీఆర్ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన మల్లారెడ్డి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా తీసుకొని క్రీడాకారులు ముందుకెళ్లాలన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధికి సంబంధించి నిర్వహించిన ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన 17వ వార్డు టీమ్‌కు కప్‌తో పాటు ప్రథమ బహుమతి కింద రూ.50 వేల నగదు, రన్నర్‌గా నిలిచిన 9వ వార్డు టీమ్‌కు కప్‌తో పాటు ద్వితీయ బహుమతి కింద రూ.25 వేల నగదును మంత్రి మల్లారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్‌చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కౌకుట్ల తిరుపతిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సంపనబోలు హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే వ్యర్థాలను తొలగించాలి

స్కూల్ ఆవరణను పరిశీలించిన చైర్ పర్సన్

సాక్షి ఎఫెక్ట్..

ఘట్‌కేసర్: 'సాక్షి' పత్రికలో గురువారం ప్రచురితమైన 'ఇవి స్కూళ్లేనా'..? అన్న కథనంతో స్పందించిన ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపిరెడ్డితో కలిసి ఆ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో పొగైన చెత్త, చెదారాన్ని పూర్తిగా శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో రహీం, హెచ్‌ఎం పాపిరెడ్డి, జంగయ్య యాదవ్, కాంట్రాక్టర్ మాధవరెడ్డి, మున్సిపల్ కార్యాలయం, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ జెడ్పీ బాలుర పాఠశాలను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

జవహర్‌నగర్‌లో శరవేగంగా ప్రగతి పనులు


ప్రగతి పనులను ప్రారంభిస్తున్న మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 15, 8, 26వ డివిజన్లలో గురువారం మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌లు ప్రగతి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. ప్రగతి పనులతో జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పానుగంటి బాబు, నాయకులు మహేష్, నాగభూషణం, శ్రీనాథ్, శ్రీమన్, కృష్ణారెడ్డి, సుధాకర్‌గౌడ్, మల్లారెడ్డి, రజిత కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'పల్లె ప్రగతి' దినోత్సవం


పూడూర్‌లో పంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ బాబుయాదవ్


దబీల్‌పూర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

కీసర: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు గ్రామంలో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్మికులను ఘనంగా సత్కరించి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను చదవి వినిపించారు. అతి తక్కువ సమయంలోనే గ్రామాల్లో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలు, సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాలు, హరితహారం, ఎల్ఈడీఓ వీధి దీపాల ఏర్పాటు, రైతు వేదికల నిర్మాణాలు తదితర పనులు చేపట్టినట్లు సర్పంచులు సభలో తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ఆయా గ్రామాలసర్పంచులు ఆకిటి మహేందర్‌రెడ్డి, నాయకపు మాధురి, పుట్ట రాజు, తుంగ ధర్మేందర్, సుంకరి కవితాజైహింద్‌రెడ్డి, విమల, అందాలు మల్లేష్, సత్తమ్మ, పెంటయ్య, కౌకుట్ల గోపాల్‌రెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామకార్యదర్శులు, ఉపసర్పంచులు, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ మండలంలో..

మేడ్చల్‌రూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామ సర్పంచ్, కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ తోరణాలు కట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జెండా ఆవిష్కరించి గ్రామసభ నిర్వహించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చేపట్టిన పనులు, పథకాలను గ్రామస్తులకు వివరించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఉత్సాహంగా..

మేడ్చల్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని డబీల్‌పూర్, నూతన్‌కల్, గౌడవెల్లి, రాయిలాపూర్, బండమాదారం, శ్రీరంగవరం తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జాతీయ జెండాలను ఎగురవేసి గ్రామ సభలను నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీలను నిర్వహించారు. అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులను ఘనంగా సత్కరించారు. డబీల్‌పూర్ సభలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, సర్పంచ్ గీత భాగ్యారెడ్డి, నూతన్‌కల్‌లో సర్పంచ్ కవిత జీవన్, పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు రుక్సానా యూనుస్ పాషా, ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పొన్నాల్ గ్రామంలో..

శామీర్‌పేట్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఉమ్మడి శామీర్‌పేట మండలంతో పాటు తూంకుంట మున్సిపాలిటీలో కొనసాగుతున్నాయి. గ్రామాల్లోని మహిళలు ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేశారు. శామీర్‌పేట మండలం పొన్నాల్ గ్రామంలో సర్పంచ్ సుకన్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు బట్టలతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రభాకర్, శివశంకర్, శివ, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.


గోధుమకుంటలో పల్లె ప్రగతిలో సర్పంచ్ మహేందర్‌రెడ్డి తదితరులు


యాద్గార్‌పల్లిలో పంచాయతీ కార్మికులను సత్కరిస్తూ..


పొన్నాల్‌లో బట్టలు, నిత్యావసర సరుకులను అందజేస్తున్న సర్పంచ్ సుకన్య